క్లుప్తంగా

డాక్టర్ వినయ్‌కు అభినందనలు


డాక్టర్ యర్రంశెట్టి వినయ్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ సీపీ పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా భీమవరానికి చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ యర్రంశెట్టి వినయ్ కుమార్ నియమితులు కావడంపై ఆదివారం పలువురు డాక్టర్లు, ప్రముఖులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ యర్రంశెట్టి వినయ్‌కుమార్‌ను జాయింట్ సెక్రటరీగా నియమితులు కావడం తెలిసిందే.

సర్పంచ్ జగ్గరాజుకు మాతృవియోగం

కాళ్ల: ఏలూరుపాడు సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు మాతృమూర్తి వెంకటనరసయ్యమ్మ (90) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఏలూరుపాడులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ గోకరాజు రామరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు సంతాపం తెలిపారు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

వీరవాసరం: వైఎస్సార్ సీపీ మండల నూతన కన్వీనర్‌గా ఎన్నికైన కడలి ధర్మారావును ఆదివారం పలువురు నాయకులు అభినందించారు. మండల మాజీ కన్వీనర్ నేతల జ్ఞానసుందరరాజు మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గోలగాని సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, గెడ్డం భాస్కర్‌రావు, కాటం స్టాన్లీ రాజు, పాటియ్య, బండి బాలాజీ, కవురు శ్రీనివాస్ (బండ), విప్పర్తి రాధాకృష్ణ పాల్గొన్నారు.

నిశాంత్‌వర్మకు ఎడ్యుప్రెన్యూర్ అవార్డు

సాక్షి, భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మకు టైమ్స్ బిజినెస్ అవార్డ్స్‌లో భాగంగా యంగ్ ఎడ్యుప్రెన్యూర్ అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణమరాజు ఆయన తరపున అవార్డును అందుకున్నారు.

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌కు సత్కారం

ఉండి: ఇటీవల గ్రూప్–1లో టాపర్‌గా నిలిచి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్‌లో చేరిన జి.భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూషను శనివారం రాత్రి చినపుల్లేరులో సర్పంచ్ పెన్మత్స సావిత్రమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స రామరాజు ఘనంగా సత్కరించారు. ప్రత్యూష తండ్రి చినపుల్లేరులో ఉపాధ్యాయుడిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. తొలుత బాణసంచా కాల్పుల నడుమ ప్రత్యూషకు గ్రామంలోకి స్వాగతం పలికారు. కట్రెడ్డి శ్రీను, అభిరుచి కాశీ, తోట హరిబాబు, సాగిరాజు నాగరాజు, పెన్మత్స రామలింగరాజు, పెన్మత్స రంగరాజు, పెన్మత్స ప్రసాదరాజు పాల్గొన్నారు.

వినాయకా.. సెలవిక

ఆకివీడు: సిద్ధి, బుద్ధి ప్రసాదించే బొజ్జగణపయ్యకు ఆదివారం భారీ ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంతపేటలోని ఇల్లాపువారి వీధిలో వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిట్లో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి 15 రోజులు అంగరంగ వైభవంగా పూజలు చేశారు. స్వామివారి విగ్రహాన్ని ఆదివారం పట్టణంలో ఊరేగించారు. శక్తివేషాలు, కేరళ నృత్యాలు, తీన్‌మార్, గరగ నృత్యాలు పలువుర్ని అలరించాయి. స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ కుంచాడ బాబ్జీ, కమిటీ సభ్యులు వారాడ మణికంఠ, పాటూర్నారి మణికంఠ, మజ్జి తిరుమలగిరి, గునాని కిరణ్, ఎస్కే రహీమ్, సిద్దా సాయి, మజ్జి దిలీప్, కోయిలపు సూరి పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శాంతినగర్‌లో, కాకర్ల వారి వీధిలో, అయిభీమవరంలో అన్నసమారాధనలు నిర్వహించారు.

గ్రామాల స్వచ్ఛతతోనే అందరికీ ఆరోగ్యం

- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


భీమవరంలో కార్యక్రమంలో పాల్గొన్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు


ఏఎస్సార్ నగర్ పార్కులో చెత్త తొలగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్


భీమవరం బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎస్పీ రవిప్రకాష్



భీమవరంలో డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ


వెలంపేటలో స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్న జామి హైమావతి


వీరవాసరంలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దేందుకు పౌరుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఉద్ఘాటించారు. ఆదివారం భీమవరంలో చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మండలి చైర్మన్ పాల్గొని స్వచ్ఛతా కార్యక్రమాలను విద్యార్థులతో కలిసి నిర్వహించారు. తొలుత 11వ వార్డు బీఎస్ రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం కొద్ది సమయం స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం 33వ వార్డులో గొల్లవానితిప్ప కెనాల్ వద్ద విద్యార్థులతో కలిసి స్వచ్ఛత శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని భారత ప్రధాని, రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాలు అన్ని ప్రాంతాలలో స్వచ్ఛత ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. గాంధీ ఆనాడే స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొనేవారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంటూ పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచితే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా స్వచ్ఛందంగా ఎవరికి వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనరు ఎం.శ్యామల, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ కె.వెంకట లక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ పి.త్రినాథరావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛత హి సేవ కార్యక్రమం స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కలిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రజలను కోరారు. ఆదివారం స్థానిక గొల్లవానితిప్ప కెనాల్‌కు ఇరువైపులా ఉన్న గట్లపై ఉన్న చెత్తను తొలగించేందుకు కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలలో నూరుశాతం పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛతా కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛందంగా చేపట్టడం జరిగిందన్నారు. చెత్తను తొలగించడానికి, తగ్గించడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, దీనిపై ప్రజలలో పూర్తి అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. మన ఇంటితో పాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆయా ప్రాంతాలు రోగాలకు దూరంగా ఉంటాయన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. అనంతరం కొవ్వాడ అన్నవరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి స్వచ్ఛతా కార్యక్రమాలను పర్యవేక్షించి స్థానిక మండల అధికారులకు సూచనలిచ్చారు. గ్రామాలలో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా జల వనరులు కలుషితం కాకుండా నిరోధించగలమన్నారు. మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, ఎంఈఓ త్రినాథరావు, బీవీరాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేసిన ఎస్పీ

సాక్షి, భీమవరం: స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎస్పీ యు రవిప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

భీమవరం (ప్రకాశం చౌక్): పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఏఎస్సార్ నగర్ పార్కులో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కొడవలితో పార్కులో మొలిచిన గడ్డిని కోసి మున్సిపాలిటీ డస్ట్ బిన్‌లలో వేశారు. చీపురుతో పార్కును శుభ్రపరిచి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలు శుభ్రతగా ఉంటేనే ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్డీవో దాసిరాజు, పార్టీ సీనియర్ నాయకులు గోకరాజు రామం, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహసీల్దార్ వై.రవికుమార్, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.

డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో..

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ కాడెట్ల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించి, కాడేట్లతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. అనంతరం ఎన్‌సీసీ కాడెట్స్ స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి, పూలదండలు వేసి కళాశాల సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించారు. ఆనంతరం స్వచ్ఛ భారత్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య, సీనియర్ కాడెట్లు సీహెచ్ హేమసుందర్, ఎస్.సాయిప్రసన్న, డి.మహాలక్ష్మి, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

ఆకివీడు: పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానికంగా పలు వార్డుల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. వెలంపేటలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తూర్పుకాపు డైరెక్టర్ జగ్గరోతు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. ఆయా వార్డుల్లోనూ పలు గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

వీరవాసరంలో..

వీరవాసరం: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను మండలంలో ఆదివారం నిర్వహించారు. ఆయా సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛంద శ్రమదానం చేపట్టారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చికిలే మంగతాయారు, గెడ్డం భారతి, దుర్గాప్రసాద్, గెడ్డం భాస్కరరావు, కోడె వరలక్ష్మి, నల్లమల్లి రేణుక, వై శ్రీనివాసరావు, మేకల వెంకటచలపతి ,దాసరి మహాలక్ష్మి ,దాసరి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో..

పాలకోడేరు: మండలంలో ఆదివారం స్వచ్ఛతాహి కార్యక్రమాలు నిర్వహించారు. వేండ్ర తదితర గ్రామాల్లో ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు సచివాలయాల్లో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. సర్పంచ్‌లు బొల్లా శ్రీనివాస్, చింతపల్లి వెంకటనారాయణ, జంగం సూరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


భోగయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ కమిటీలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమితుడైన తోట భోగయ్య ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం , అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో జగన్ సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనను ఇంటి ముంగిటకు తీసుకొచ్చేందుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఏర్పాటైన కమిటీలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. అనంతరం భోగయ్యను ఎమ్మెల్యే శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు మానేపల్లి నాగన్న బాబు, కామన నాగేశ్వరరావు, నల్లం రాంబాబు, గాదిరాజు తాతరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, కోమటి రాంబాబు, షేక్ రబ్బానీ, కరీముల్లా బాషా, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, సరిపిడకల వెంకటేశ్వరరావు, ముతకాన పిచ్చెయ్య తదితరులున్నారు.

మోషేన్‌రాజును కలిసిన భోగయ్య


మోషేన్‌రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భోగయ్య

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన తోట భోగయ్య ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భోగయ్య పుష్పగుచ్ఛం అందించడంతో మోషేన్‌రాజు అభినందనలు తెలిపారు. భోగయ్య వెంట పార్టీ నాయకులు కోడే యుగంధర్, సరిపిడకల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

బీసీ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగరాజు


బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న నాగరాజు

కాళ్ల: ఏపీ బీసీ సంఘం ఉండి నియోజకవర్గ అధ్యక్షుడిగా బొండాడ మాజీ సర్పంచ్ మన్నే నాగరాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బొండాడలో నాగరాజు నివాసం వద్ద జరిగిన జిల్లా స్థాయి బీసీ సంఘం ఆత్మీయ సదస్సులో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారిష్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహీధర్, జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటాచార్యులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. బీసీలంతా కలిసికట్టుగా ఉండి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని, బీసీలను గుర్తించిన వైఎస్సార్ సీపీ తమ మద్దతు తెలపాలని ఏకగ్రీవంగా నిర్ణయించామన్నారు. కాళ్ల మండలాధ్యక్షుడుగా పాటూర్నారి రామారావు, ఉండి మండలానికి అంగర రాంబాబు, ఆకివీడు మండలానికి నున్న గణపతి, పాలకోడేరు మండల అధ్యక్షుడుగా బొక్కా రాంబబులను నియమించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, వీరమల్లు బోసు, బోదనపు కన్నయ్య, కందుల హనుమ, మందపాటి రవి తదితరులు నాగరాజును అభినందించారు.

జగనన్న ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి


పాములపర్రులో పీవీఎల్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి జరుగుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి మండలం పాములపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు, జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మొత్తం రూ.31 లక్షలతో ఎస్సీ కాలనీలో చేపట్టే అభివృద్ధి పనులకు ఆదివారం పీవీఎల్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయ పరిధిలో ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభించి పలు ప్రాంతాల్లో పూర్తి చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలన్నారు. ఆయనను ఆశీర్వదించి మరోసారి ప్రజా సంక్షేమ ప్రభుత్వం నెలకొల్పుదామని పీవీఎల్ అన్నారు. సర్పంచ్ కేశన శాంతకుమారి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, మండల వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ తాటిపట్టి పెదవీరప్ప, గ్రామ పార్టీ అధ్యక్షుడు వర్రే పైడియ్య పాల్గొన్నారు.

సర్రాజు ఆశయాలను నెరవేరుస్తా


పాతపాటి శ్రీనివాసరాజును సత్కరించిన దృశ్యం

ఆకివీడు: పేదల పాలిటి పెన్నిధిగా సేవలందించిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పాతపాటి సర్రాజు ఆశయాల్ని నెరవేరుస్తానని ఆయన తనయుడు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. చెరుకుమిల్లిలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం శ్రీనివాసరాజుకు ఘన సన్మానం చేశారు. తన తండ్రి ఇచ్చిన హామీ మేరకు చెరుకుమిల్లిలో చర్చి నిర్మాణానికి సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎరిచర్ల సాంబర్లిన్, పాస్టర్ జయపూర్ణ, సర్పంచ్ నందమూరి ప్రకాశం, ఎరిచర్ల గాడ్‌సన్, యాకోబు జానీ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

సాక్షి, భీమవరం: అంతర్జాతీయ వృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా తాడేరు రోడ్డులోని వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్యానల్ లాయర్లు ఎస్.సుధీర్, డి.రవికిరణ్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన తరువాత అనేక కుటుంబాల్లో పెద్దలను నిర్లక్ష్యం చేయడం వల్లనే వృద్ధాశ్రమాలు ఏర్పడ్డాయన్నారు. పెద్దలను నిర్లక్ష్యం చేయడం వల్లనే వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టాలు అమలులోనికి వచ్చాయన్నారు. సీనియర్ సిటిజన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి అన్ని ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రత్యేక ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వృద్ధాప్యపు పెన్షన్ రాకుంటే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సలహా పొందవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పాలకోడేరు: కుముదవల్లిలో సెయింట్ పాల్ లూథరన్ ప్యారిస్ చర్చి, నవశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్యారిస్ పాస్టర్ వి.లాభాను ఆదివారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మొత్తం 50 జట్లు పాల్గొంటాయన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తామన్నారు. తొలిరోజు కుముదవల్లి చినపేట, కుముదవల్లి పెదపేట జట్లు తలపడ్డాయి. కమిటీ మెంబర్లు యాల ఏలియా, గుమ్మళ్ల భూషణం, పి జీవరత్నం, పాము ఫ్రాంక్లిన్, వై.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఎంఆర్ రాజుకు గాంధీ శాంతి పురస్కారం


ఎంఆర్ రాజుకు గాంధీ శాంతి పురస్కారం అందిస్తున్న సర్వోదయ మండలి సభ్యులు

కాళ్ల: గాంధీ జయంతిని పురస్కరించుకుని పెదఅమిరం గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఆర్ రాజు గాంధీ శాంతి పురస్కారం–2023ని అందుకున్నారు. పెదఅమిరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి సంస్థ ప్రతినిధి చర్ల మృదులకుమారి ఎంఆర్ రాజుకు పురస్కారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పలువురు మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో నాలుగు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్య సేవలు అందించారన్నారు. అనంతరం ఎంఆర్ రాజును పూలమాలలు దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. పురస్కార గ్రహీత ఎంఆర్ రాజు మాట్లాడుతూ గాంధీజీ సత్యం అహింస విధానాలే దేశ ఔన్నత్యానికి పునాదులన్నారు. పలువురు ఉత్తమ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, ఎంజీఎం ట్రస్ట్ ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు

ఆకివీడు: మానవ సేవే మాధవ సేవ అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక లయన్స్ ఆడిటోరియంలో సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం, నాలుగు లయన్స్ క్లబ్‌లు, ఎండీ బాషా జ్ఞాపకార్థం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధులకు విశిష్ట సేవలందిస్తుందన్నారు. అనంతరం పలువురు వృద్ధుల్ని సత్కరించారు. బాషా కుమారులు ఆర్థిక సహకారంతో 100 మంది వృద్ధులకు పంచెలు, చీరలు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎమ్వీ.సూర్యనారాయణరాజు, సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాస్, ఎండీ జక్కీ, కృష్ణంరాజు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.